క్లుప్తంగా

మంత్రి కోమటిరెడ్డికి స్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, ఎంపీ తదితరులు

నారాయణఖేడ్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నిజాంపేట్ మండలం బాచేపల్లి జాతీయ రహదారి గుండా వెళ్తుండటంతో బాచేపల్లి వద్ద కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. జుక్కల్ నియోజకవర్గంలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు హాజరుకానున్నారు. బాచేపల్లి వద్ద ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి స్వాగతం పలికి ఆయన వెంట ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వెళ్లారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో సోమవారం ఆషాఢ తొలి ద్వాదశ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీ సేవ ఊరేగింపు నేత్రపర్వంగా నిర్వహించారు. పాండురంగ స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన పల్లకీ ఊరేగింపు ప్రధాన వీధుల గుండా కొనసాగింది. ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు వేణుగోపాల్, నామ రవికిరణ్ బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ కిషన్ సోమవారం పరిశీలించారు. రోడ్లు మురుగు కాలువల శుభ్రత తడి, పొడి చెత్త సేకరణ జరుగుతున్న తీరుతెన్నులను పర్యవేక్షించారు. వర్షాకాలం నేపథ్యంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా కమిషనర్ స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్ స్పెక్టర్ వినోద్ కుమార్, పారిశుద్ధ్య కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోండి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): బెస్ట్ వెంచర్ యజమాన్యం ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తోందని మంగంపేట గ్రామస్తులు సోమవారం ఆర్‌ఐ యాదగిరిని కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 36లో బెస్ట్ వెంచర్ యజమాన్యం ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలను చేపడుతోందని గ్రామానికి చెందిన రవీందర్, లక్ష్మణరావులు రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇష్టపూర్వకంగా యాజమాన్యం వ్యవహరిస్తూ గ్రామంలోని రామాలయ భూమికి అడ్డుగా దారిని ఏర్పాటు చేస్తోందని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న వెంచర్ యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీకాంత్, వెంకటేశం పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్తయ్య

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని గంగారంలో సోమవారం ఎంపీడీఓ సత్తయ్య ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 44 మంది ఉపాధి హామీ కూలీలు రెండు ఫారం ఫండ్స్ పనులను చేస్తున్నారన్నారు. అలాగే, గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి, మొక్కలు ఆరోగ్యంగా నాటడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. నర్సరీలో 7వేల మొక్కలను పెంచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం సత్తయ్యతో పాటు ఏపీఓ వీరప్ప ఫీల్డ్ అసిస్టెంట్ రవి, పంచాయతీ కార్యదర్శి మంజుల పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఫ్లైఓవర్ బ్రిడ్జి

గుంతలు పడిన రోడ్డు

- ఊడిపడుతున్న సైడ్ గ్రిల్స్
- పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళన చెందుతున్న ప్రజలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రాంనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జి సైడ్ గ్రిల్స్ దెబ్బతిని పెచ్చులు ఊడికింద పడుతున్నాయి. పలు చోట్ల రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి ప్రమాదకరంగా మారడంతో ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి పల్లి ప్రాంతంలో సుమారు 25 సంవత్సరాల క్రితం రాంనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. దీంతో రాంనగర్, హోతి(కె), మల్‌చెల్మ, శేకాపూర్‌తో పాటు తాండూర్ తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడింది. రెండున్నర దశాబ్దాలు దాటడంతో బ్రిడ్జి రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. బ్రిడ్జికి ఇరువైపులా సైడ్‌గ్రిల్స్(గోడలు) దెబ్బతిని పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. బ్రిడ్జి కింద ఉన్న నివాస ప్రాంతాల్లో పడడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి సైడ్ గ్రిల్స్‌పైకి దూసుకువచ్చింది. అదృష్టవశాత్తు కింద పడకుండా మధ్యలోనే ఆగిపోయింది. సైడ్‌గ్రిల్స్(పిట్టగోడ) కూలిపోవడంతో కాలినడకన వెళ్లే పిల్లలు, వృద్ధులు కిందపడే అవకాశాలు ఉన్నాయి. ప్రమాదాన్ని గుర్తించి స్థానికులు గోడ కూలిన చోట కర్రలను అడ్డంగా కట్టారు.



ఊడి పడిన సైడ్ గ్రిల్స్ గోడలు

కనీస మరమ్మతులు కరువు

బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదం పొంచి ఉన్నా సంబంధిత శాఖ అధికారులు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి. రోడ్డు మధ్యలో పడిన గుంతలను కూడా పూడ్చడం లేదు. సైడ్ గ్రిల్స్ ఊడికింద పడిన ప్రాంతంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం లేదు. బ్రిడ్జికి ఇరుపక్కల గల స్ట్రీట్ లైట్లు కూడా సరిగ్గా వెగలడం లేదు. రాత్రి పూట అంధకారం నెలకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. చినుకపడితే చాలు బాగారెడ్డి విగ్రహం వద్ద మోకాలి వరకు నీరు నిలుస్తోంది. దీంతో బ్రిడ్జిపై నుంచి ప్రయాణించాలంటే ప్రజలు భయపడుతున్నారు. బ్రిడ్జి పనులు నాసిరకంగా చేపట్టడం వల్ల దెబ్బతిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



గ్రిల్స్ గోడ కూలడంతో కర్రలను కట్టిన ప్రజలు

ప్రతిపాదనలు పంపాం

రాంనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామని ఆర్‌అండ్‌బీ ఏఈ సంధ్య అన్నారు. నిధులు మంజూరయిన వెంటనే మరమ్మతులు పనులను ప్రారంభిస్తామన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

హత్నూర(సంగారెడ్డి): ఈనెల తొమ్మిదిన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం దౌల్తాబాద్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. జూలై 9న నిరసన, సమ్మెలో పాల్గొని మోదీకి గుణపాఠం చెబుదామన్నారు. 4 లేబర్ కోడ్స్ రద్దు అయ్యేవరకు మరో పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్మికుల హక్కుల హరించి.. లాభాల అర్జించే పెట్టుబడిదారుల కోసమే కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్స్ అమలు అయితే కార్మికులకు సమ్మె చేసే హక్కు, యూనియన్ పెట్టుకునే హక్కు, పని 8 గం కు12 గంటలకు పెంపు, సామాజిక భద్రత అంశాలు పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షుడు మంగా, హత్నూర మండల నాయకులు శేఖర్, మారుతిరాజు. కిరణ్. షబ్బీర్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డు ఏర్పాటు

వట్‌పల్లి(అందోల్): సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. వట్‌పల్లి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికార యంత్రాంగం బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీనిపై ఈనెల 5న సాక్షి దినపత్రికలో 'సమాచార హక్కు చట్టం బోర్డులేవి..?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం బోర్డును ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చిన పలువురు బోర్డును చూసి తమకు కావాల్సిన సమాచారం పొందేందుకు అవకాశం ఉంటుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్



తహసీల్ ఆఫీసులో ఏర్పాటు బోర్డు

బకాయిలు విడుదల కోసం ధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పట్టణ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం వివిధ కళాశాలల విద్యార్థులు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి సతీష్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.8 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేద విద్యార్థులు చదువులు మానేసే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ హసీనాబేగంకు అందజేశారు. సంఘం మాజీ జిల్లా కార్యదర్శి రమేశ్, డివిజన్ అధ్యక్షుడు బస్వరాజ్ పాల్గొన్నారు.

12న డబుల్ బెడ్రూంలు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్

జహీరాబాద్ టౌన్: హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఈ నెల 12న పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ ధశరత్ తెలిపారు. ఈ నెల 3న సాక్షి దినపత్రికలో'ఇళ్లు.. ఇంకెన్నాళ్లు?' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన రెవెన్యూ అధికారులు ఇళ్ల పంపిణీ ముహూర్తం ఖరారు చేశారు. 12న ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు చేతుల మీదుగా ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో హోతి(కె) వద్ద రూ. 36కోట్లతో 660 డబుల్ బెడ్ రూం ఇళ్లను కట్టించింది. అసెంబ్లీ ఎన్నికలకు మందు డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక చేసి రెవెన్యూ అధికారులు ఇళ్ల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇళ్లను అప్పగించకపోవడంతో సీపీఎం నాయకులు లబ్ధిదారులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



హోతి(కె) వద్ద నిర్మించిన డబుల్ ఇళ్లు

చెల్లి పెళ్లికి డబ్బులు లేక.. ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెల్లి పెళ్లి చేయలేకపోయానన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకోంది. పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు ప్రభుత్వ డబుల్ బెడ్రూం కేసీఆర్ నగర్‌లో నివాసముండే బస్వరాజ్(32), ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన చెల్లె పెళ్లి కుదరడంతో పెళ్లి చేసేందుకు డబ్బుల కోసం తనకు తెలిసిన వారి వద్ద , బంధువుల వద్ద అప్పు అడిగాడు. ఎవరూ ఇవ్వకపోవడంతో చెల్లె పెళ్లి చేయలేకపోతున్నానని మనస్తాపంతో ఆదివారం రాత్రి ఇంట్లో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు సోమ వారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరం



భూమిపూజ చేసిన అంజయ్య

రాయికోడ్(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని గ్రంథాలయ జిల్లా చైర్మన్ జి.అంజయ్య అన్నారు. మండలంలోని నాగ్వార్ గ్రామంలో పలువురికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బెస్మెంట్ తదితర దశల్లో కొనసాగుతున్న ఇళ్లను పరిశీలించారు. బిల్లుల చెల్లింపుపై వివరాలు తెలుసుకున్నారు. నాయకులు జ్ఞానేశ్వర్, విఠల్,పండరి,రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

సమష్టిగా పోరాడుదాం



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): రాజకీయ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా గత 153 రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మద్రాసు కోర్టులో దాఖలైన పిటిషన్ సోమవారం విచారణకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు శంకర్, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఈఎస్ఐ ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గత నాలుగు నెలలుగా యాజమాన్యం వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో కార్మికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష,కార్యదర్శులు జి సురేష్,యాదయ్య,కార్మికులు లోకనాథ్, సంతోష, ప్రమీల, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ హరివిల్లు కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో కోటి పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విలీన గ్రామాల పరిధిలో ఏర్పడుతున్న నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.. ప్రధానంగా సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, డీఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



పటాన్‌చెరు: రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

గణేష్‌గడ్డ ఆలయం అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి రుద్రారంలోని గణేష్‌గడ్డ సిద్ధి వినాయకుడిని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయ ధర్మకర్తలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... గుడికి నాలుగు వైపులా నిర్మిస్తున్న రాజగోపురం నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. ప్రధానంగా నిత్య అన్నదానం కోసం ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక కిచెన్‌తో పాటు.. వివాహాది శుభకార్యాల కోసం కల్యాణమండపం, గుడి ఆదాయం కోసం దుకాణాల సముదాయం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో గ్రామ మాజీ సర్పంచ్ సుధీర్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు పాండు, మాజీ ఎంపీటీసీ రాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి లావణ్య, శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జీఓ 282ను వెంటనే రద్దు చేయాలి

జిన్నారం (పటాన్‌చెరు): జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య డిమాండ్ చేశారు. సోమవారం బొంతపల్లి పారిశ్రామికవాడలోని నూలాండ్ పరిశ్రమ వద్ద కార్మికులతో కలిసి జీఓ నంబర్‌ను 282 దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు పని సమయాన్ని 10 గంటలకు పెంచుతూ విడుదల చేసిన జీఓ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికుల శ్రమ ను దోపిడీ చేస్తుందని మండిపడ్డారు.

◆ చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన

నారాయణఖేడ్: మండలం పరిధి వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని భక్త మార్కండేయస్వామి వారి ఆలయంలో సోమవారం చంద్రమౌళీశ్వరుడికి పుష్పార్చన, అభిషేకం నిర్వహించారు. ఉదయం మహాహారతి, పుష్పాభిషేకం, పుష్పార్చన, గీతా పారాయణం, హనుమాన్ చాలీసా, లలితాసహస్రనామావళి, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

◆ విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ నమోదు

కొండాపూర్(సంగారెడ్డి): పాఠశాలలోని విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలని మండల విద్యాధికారి దశరథ్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం కొండాపూర్‌లోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ప్రభుత్వ దుస్తులు, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్, బుక్స్ పుస్తకాలు పంపిణీ చేసిన విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. సంఖ్యను బట్టి వర్క్ అడ్జస్ట్మెంట్ చేయడం జరిగిందన్నారు. 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు.

◆ బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో గొల్లకురుమల ఆధ్వర్యంలో పసక పండుగ నిర్వహించారు. బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

◆ సమ్మె నోటీసు అందజేత

నారాయణఖేడ్: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సోమవారం సీఐటీయూ నాయకులతో కలిసి ఖేడ్ మున్సిపల్ సంఘం కార్మికులు శానిటరీ అధికారి శ్రీనివాస్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సతీష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి వాళ్ళ హక్కులను కాలరాస్తున్న పరిస్థితి ఉందన్నారు. కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

◆ పాటల పల్లకీ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

జిన్నారం (పటాన్‌చెరు): మరుగునపడుతున్న తెలగాణ కళాకారుల జీవితాల్లో నూతన వెలుగులు నింపేందుకు 'పాటల పల్లకీ' కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని కవి గాయకుడు నేర్నాల కిషోర్ అన్నారు. సోమవారం పాటల పల్లకీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. 13న మెదక్‌లోని టీఎన్జీఓ భవన్‌లో పాటల పల్లకీ కొనసాగుతుందన్నారు.

◆ 17 మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 17 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ 32 బెంచీలు ఏర్పాటు

శివ్వంపేట(నర్సాపూర్): తండ్రి జ్ఞాపకార్థం కొడుకు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశాడు. మండల పరిధి దొంతి గ్రామానికి చెందిన మొగుడంపల్లి ఆనంద్ తన తండి జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రధాన కూడళ్లు, వైకుంఠధామం, ఆలయాల వద్ద రూ.77 వేలతో 32 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశాడు. బెంచీలు ఏర్పాటుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పెద్దపీర్ల ఊరేగింపు



జహీరాబాద్: పీర్లను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలో పీర్ల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. తడ్కల్, బాన్సువాడ, దామర్‌గిద్దా, జమ్గి, ముర్కుంజాల్, కంగ్టి తదితర గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి పీర్ల మసీదుల ఆవరణలో నాటకాలు వేసి జాగరణ చేశారు. మతసామరస్యంతో హిందువులు పండగలో పాల్గొని నృత్యాలు చేశారు.

పీర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

జహీరాబాద్: పట్టణంలో ప్రతిష్ఠించిన పీర్లను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు దర్శించుకున్నారు. సోమవారం గడి మహెలాలోని జుల్ఫేకర్ హుసేనీ భాష బాద్షా హుసేనీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పీర్లను ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సద్రుద్దీన్‌గౌరీ, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, రవికిరణ్, నాయకులు పాల్గొన్నారు.